ప్రశ్నార్థకంగా రైతు భరోసా..

- పదెకరాల వరకు భరోసా ఇవ్వాల్సిందేనన్న రైతులు

తూడుకుర్తిలో రైతుల నుంచి అభిప్రాయలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

నాగర్‌కర్నూల్, జూన్ 25 : కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు(ప్రస్తుతం రైతుభరోసా) పథకం అమలు పరిచే విషయం ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం ప్రారంభమై రైతులు పంటలు సాగు చేసుకుంటున్నా నేటికీ రైతులకు పెట్టుబడి సాయం కింద అందించాల్సిన ఆర్థిక సాయం వారి ఖాతాల్లో జమ కాలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని రకాల భూములు కలిగిన రైతులకు పెట్టుబడి సాయం కింద వేల ఎకరాలకు రైతుబంధు జమ చేసినప్పటికీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విధంగా రైతుల ఖాతాలో జమచేసేందుకు ముందుకు రావడం లేదు. రైతుబంధుగా ఉన్న పథకాన్ని రైతు భరోసాగా మార్చడంతోపాటు పథకం విధానాలను మారుస్తూ కొత్త నిబంధనలు పెట్టేందుకు నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో ఎకరాకు రూ.15వేలు సాయం అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలుకు వచ్చే సరికి ఆ సాయం ఐదెకరాలలో పు భూమి ఉన్న రైతులకు మాత్రమే అందించాలనే నిర్ణయం తీసుకున్నది. ఈక్రమంలో రైతులు, రైతు సంఘాల నాయకుల నుంచి వ్యతిరేకత రావడంతో పునరాలోచన చేసి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. దీంతో మంగళవారం జిల్లాలోని డివిజన్ స్థాయిలో రైతు వేదికల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారినుంచి అభిప్రాయాలను సేకరించింది. రైతుల అభిప్రాయాలను వ్యవసాయాధికారులు ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో చేరవేశారు.

వెల్దండలో..

వెల్దండ, జూన్ 25 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా పథకం విధి విధానాలపై అభిప్రాయ సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. మంగళవారం వెల్దండ మండలం రాచూర్‌లో రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కల్వకుర్తి ఏడీఏ కిరణ్‌కుమార్ హాజరై రైతు భరోసా పథకం విధి విధానాలపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వెల్దండ ఏవో మంజుల తెలిపారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, జూన్ 25 : మండలంలోని పెద్దకారుపాములలో రైతు భరోసాపై మంగళవారం రైతులతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. డివిజన్‌స్థాయి సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర చైర్మన్ చిన్నారెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

'రైతుభరోసా'కు పకడ్బందీ చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- తూడుకుర్తి నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 25 : ప్రభుత్వ ధనం వ్యర్థం కావద్దనే ఉద్దేశంతోనే రైతు భరోసా కార్యక్రమం మరింత పకడ్బందీగా, సమర్థవంతంగా, జాగ్రత్తగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటుందన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. రైతు భరోసా విజయవంతం చేయడానికే అందరి సూచనలు పరిగణలోకి తీసుకొని సబ్ కమిటీతో చర్చించి జూలై 15వ తేదీలోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. పలు జిల్లాల రైతు వేదికల నుంచి రైతులు 10 ఎకరాల వరకు రైతు భరోసాను అమలు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అపోహలను సమ్మొద్దని, రైతులకు పూర్తి న్యాయం చేకూరే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయన్నారు. ఎంత విస్తీర్ణం పంటలు పండిస్తే అంత విస్తీర్ణానికి రైతు భరోసా అందించాలని, పరిమితి విధిస్తే అంతలోపే పంటలు వేసే అవకాశం ఉందన్నారు. కౌలుదారులు, రైతులకు రైతు భరోసానుసగం సగం అందించాలని, నిజంగా వ్యవసాయం చేస్తున్న అందరికీ సకాలంలో రైతుభరోసా అందించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని, వ్యవసాయ అనుబంధ పనులకు ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి రైతు వేదికలో గ్రామంలోని రైతులు, కలెక్టర్ బడావత్ సంతోష్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆర్గానిక్ పంటలకు మంచి డిమాండ్ ఉందని, ఆ దిశగా పంటలసాగు చేయాలన్నారు. మార్కెటింగ్ అవకాశాల మేరకు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. మహిళా రైతులు కూడా ముందు కొచ్చి పంటలుసాగు చేయాలన్నారు. అన్నదాతలకు ఆలంబనగా రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం ద్వారా రైతులకు అధిక దిగుబడులు సాధించడంలో మెళకువలు, సలహాలు, సూచనలు, సాంకేతిక ఉపకరణాల వినియోగంపై ప్రతి మంగళవారం అవగాహన కలిగిస్తున్నదని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, నాగర్‌కర్నూల్ తాసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ రైస్‌ను తక్షణమే అందజేయాలి

- నిర్లక్ష్యం వహిస్తున్న మిలర్లపై క్రిమినల్ కేసులు
- కలెక్టర్ బడావత్ సంతోష్

మిలర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 25 : సీఎంఆర్ రైస్‌ను మిల్లర్లు తక్షణమే అందించాలని కలెక్టర్ బడావత్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిలర్లతో సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ బియ్యాన్ని తక్షణమే ప్రభుత్వానికి అందజేయాలని, వానకాలం 2023-24కు సంబంధించి 49వేల 048మెట్రిట్ టన్నుల సీఎంఆర్‌ను ప్రభుత్వానికి చెల్లించగా, ఇంకా 41 వేల 458మెట్రిట్ టన్నుల బియ్యాన్ని చెల్లించాల్సి ఉన్నదన్నారు. ఎన్నిసార్లు చెప్పినా సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించడం లేదని, వెంటనే అందించకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్రిమినల్ చర్యలతోపాటు ప్రాపర్టీని కూడా రికవరీ చేస్తామని, ష్యూరిటీలపై కూడా చర్యలు ఉంటాయన్నారు. వీలైనంత తొందరగా సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పజెప్పాలని మిలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎస్‌వో స్వామికుమార్, జిల్లా మేనేజర్ బాలరాజుతోపాటు జిల్లాలోని మిల్లర్లు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల కరపత్రాలు విడుదల

రాష్ట్రంలోని వివిధ క్రీడా పాఠశాలల్లో 5వ తరగతి ఎంపికల కోసం ముద్రించిన పోస్టర్లను మంగళవారం కలెక్టర్ బడావత్ సంతోష్ ఆవిష్కరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హకీంపేటలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం 8నుంచి 9 ఏండ్ల వయస్సున్న బాలబాలికల కోసం రాష్ట్ర స్థాయి సెలెక్షన్స్ జూలై నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో బాలబాలికల ఎంపికలను ఈనెల 28 న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అందుబాటులో వరి విత్తనాలు

ఉప్పునుంతల, జూన్ 25 : మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, సీఈవో రవీందర్‌రావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పీఎన్‌ఆర్ 15048 సన్నరకం 25 కేజీల బ్యాగు ధర రూ.1,094, కేఎన్‌ఎం 1638 సన్న రకం 25 కేజీల బ్యాగు ధర రూ.995, సౌభాగ్య 10 కేజీల బ్యాగు ధర రూ.900, ఎంపీఆర్ 505 సన్నరకం 10 కేజీల బ్యాగు ధర రూ.1000, ఎంపీఆర్ 404 దొడ్డురకం 10 కేజీలల బ్యాగు ధర రూ.850, ఎంపీఆర్ 404 ప్లస్ దొడ్డు రకం 10 కేజీల బ్యాగు ధర రూ.950కు విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు. ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని.. డీఏపీ బస్తా ధర రూ.1,350, 20:20:0:13 బస్తా ధర రూ.1,140, ఎంఓపీ బస్తా ధర రూ.1,700, ఎస్ఎస్‌పీ బస్తా ధర రూ.550, ఆర్గానిక్ పొటాష్ రూ.750, యూరియా రూ.267, సూపర్‌జింక్ రూ.350, సమతుల్ (7) రూ.500, స్పిక్ జింక్ రూ.600కు అందుబాటులో ఉన్నాయని.. మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

వంగూరు, జూన్ 25 : ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. మండలంలోని పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పరశురాములు పదవీ విరమణ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఎర్పాటు చేసిన వీడ్కోలు అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రి తర్వాత ముఖ్యమైన స్థానం గురువులదే అన్నారు. పదవీ విరమణ పొందుతున్న పరశురాములు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో సంతోషంగా గడుపాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పెంట్లవెల్లి : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెంట్లవెల్లి, జూన్ 25 : కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామ సమీపంలోని భ్రమరాంబ కాలనీ, చెంచుగూడెం, ఎల్లూరు, నార్లాపూర్ చెంచు కాలనీలతోపాటు అమరగిరి చెంచు పెంటల్లో జిల్లా వైద్యాధికారుల ఆదేశాను సారం మంగళవారం పెంట్లవెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది చెంచు పెంటల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ వానకాలంలో సీజన్ వారీగా వచ్చే డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి కాలనీవాసుల ఇంటి పరిసరాలను పరిశీలించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారా మెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సబ్‌యూనిట్ అధికారి రామ్మోహన్, ఎంపీహెచ్‌వో రమేశ్, సాయిరెడ్డి, వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ దివాకర్, ప్రభాకర్, భాగ్యమ్మ, శ్వేత, యశోద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీలు పనిచేయాలి

- మహిళా రాష్ట్ర శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

నాగర్‌కర్నూల్, జూన్ 25 : అంగన్‌వాడీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు విద్యను అందించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ సమీకృత కార్యాలయం నుంచి కలెక్టర్ బడావత్ సంతోష్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలు, జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, పిల్లల్లో పోషకలోపం నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందన్నారు. వీసీలో కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ పోషకలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు దోహదపడే విధంగా పౌష్టికాహారం అందజేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోషకలోపం ఉన్న పిల్లలకు అందనంగా బాలామృతం అందిస్తున్నామని, దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, డీడబ్ల్యూవో రాజేశ్వరి, సీడీపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు అవగాహన సదస్సు

కల్వకుర్తి, జూన్ 25 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు పతనమవుతున్నాయని, డ్రగ్స్ మహమ్మరి నుంచి యువతను రక్షించడంలో భాగంగా విద్యార్థులతో సదస్సు ఏర్పాటు చేశామని సీఐ చెప్పారు. ఉదయం 10:30 గంటలకు అవగాహన సదస్సును ప్రారంభిస్తామని సీఐ పేర్కొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

లింగాల, జూన్ 25 : బడీడు పిల్లలను బడిలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోనేరు సంస్థ మండల కోఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఎర్రపెంటకు చెందిన కాట్రాజు మశన్న నాలుగేండ్ల కిందట మరణించడంతో అతడి భార్య లింగమ్మ తన ఇద్దరు పిల్లలైన పుష్ప, నర్సింహతో కలిసి లింగాలకు చెందిన ఓ వ్యక్తి పొలంలో పనులు చేస్తున్నది. విషయం తెలుసుకున్న శ్రీనివాసులు మంగళవారం అక్కడికి చేరుకొని ఆమెతో మాట్లాడారు. ఇద్దరు పిల్లలకు ఆధార్‌కార్డు లేకపోవడంతో అధికారులతో మాట్లాడి ఉచితంగా అందజేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు. అనంతరం పిల్లలను బడిలో చేర్పించాలని లింగమ్మకు అవగాహన కల్పించారు. ఆధార్‌కార్డు వచ్చిన వెంటనే అచ్చంపేటలోని బాలసదన్‌లో చేర్పిస్తామని ఆయన తెలిపారు.

ఇద్దరు మహిళల బైండోవర్

బిజినేపల్లి, జూన్ 25 : మండలంలోని శాయిన్‌పల్లి తండాకు చెందిన ఇద్దరు మహిళలను తాసీల్దార్ శ్రీరాములు ముందు మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై సతీశ్‌రెడ్డి తెలిపారు. తండాకు చెందిన గోమ్లీ, దేవ్లీ ఇంటి పరిసరాల్లో సారా లభ్యమైంద ని, సారా ఎవరిదన్నది నిర్ధారణ కాకపోవడం తో ఇరువురిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో కూడా వీరిపై కేసులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

ఆధ్యాత్మికతతోనే సన్మార్గం

ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

తాడూరు, జూన్ 25 : మానవ జీవితంలో ఆధ్యాత్మికత మనిషిని సన్మార్గంలో నడుపుతుందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పొల్కూర గ్రామంలో సద్గురు పరిపూర్ణానంద మేరెడ్డి సుదర్శన్‌రెడ్డి రెండో ఆరాధన మహోత్సవం సందర్భంగా నిర్వహించిన సుదర్శన హోమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో తాడూరు మండల జెడ్పీటీసీ రోహిణి, గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వల్లభ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులను మెరుగుపర్చాలి

శ్రీశైలం, జూన్ 25 : శ్రీశైల క్షేత్రానికి వచ్చే యాత్రికులకు మౌలిక వసతులను మెరుగుపర్చాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈవో పెద్ది రాజు ఆధ్వర్యంలో ఆలయ విభాగాధిపతులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి వస్తున్న యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో అధికారుల పనితీరు మార్చుకోవాలన్నారు. ప్రధానంగా దేవస్థానం సొమ్ము వృథా చేయడం సమంజసంకాదని హెచ్చరించారు. క్షేత్రాభివృద్ధికి తోడ్పడకుండా పాలనా విధానాన్ని తప్పుదోవ పట్టించే అధికారులు, సిబ్బందిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

అదుపుతప్పి కారు బోల్తా

- హైదరాబాద్‌కు చెందిన యువతి మృతి

పెద్దకొత్తపల్లి, జూన్ 25: అదుపుతప్పి కారుబోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన పెద్దకొత్తపల్లిలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన వేదవల్లి (24) కారులో హైదరాబాద్ నుంచి సోమశిలకు సినిమా షూటింగ్ కోసం వస్తుండగా పెద్దకొత్తపల్లి పీఎంఆర్ గార్డెన్స్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న వేదవల్లి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రవీణ్‌కుమార్ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌గాంధీ దవాఖానకు తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ బోల్తా మహిళకు గాయాలు

చారకొండ, జూన్ 25 : అదుపుతప్పి లారీ బోల్తా పడిన ఘటన చారకొండ మండలంలోని మర్రిపల్లి బస్‌స్టేజీ జడ్చర్ల – కోదాడ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య కథనం మేరకు దేవరకొండ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న బియ్యం లోడ్ లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొని బోల్తా పడింది. దీంతో మర్రిపల్లి బస్ స్టేజీ వద్ద ఉన్న శాంతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చారకొండ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. శాంతి భర్త ధర్మనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

జీరో బిల్లుకు దరఖాస్తు చేసుకోవాలి

- ఎంపీడీవో బాలచందర్ సృజన్

అచ్చంపేట టౌన్, జూన్ 25 : అనివార్య కారణాల వల్ల గృహజ్యోతి పథకం అమలు కాని లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంబంధిత జిరాక్స్ కాపీలతో అచ్చంపేట పట్టణవాసులైతే మున్సిపల్ కార్యాలయంలో, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫారంతో సంబంధిత జిరాక్స్ కాపీలను జతపరిచి సమర్పించాలని ఆయన తెలిపారు.

క్రిమినల్, న్యాయ చట్టాలపై అవగాహన ఉండాలి

- మహేంద్ర లా యూనివర్సిటీ డీన్ బాలకిష్టారెడ్డి

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

నాగర్‌కర్నూల్, జూన్ 25 : క్రిమినల్, న్యాయ చట్టాలపై పోలీస్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని మహేంద్ర లా యూనివర్సిటీ డీన్ బాలకిష్టారెడ్డి సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నూతనంగా వచ్చిన క్రిమినల్, న్యాయ చట్టాలపై ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్‌తోపాటు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, న్యాయవాదులు సురేశ్, మధుసూదన్‌రెడ్డి, శివచరణ్ పోలీసులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినియమం అయిన నూతన చట్టాల గురించి తెలియజేశారు. నేర న్యాయ చట్టాలు ఆధునీకరించబడ్డాయని, నూతన చట్టాలు క్రిమినల్ న్యాయ చట్టాలు నేర విచారణలో భాగమై ట్రయల్ స్టేజీలు, ఆవిష్కరణలు లింగసమానతపై, లింగ వివక్షతను రూపుమాపడంతోపాటు లింగ సమ్మేళనాన్ని, నేర బాధితుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయన్నారు. చిన్న చిన్న నేరాల విచారణ పద్ధతులను కూడా న్యాయ వ్యవస్థ పటిష్ట పరిచి వేగవంతం చేయనున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. డీన్ బాలకిష్టారెడ్డి న్యాయ సూత్రం గురించి వివరించారు. ప్రత్యేకించి పోలీస్ అధికారులకు దీనిపై జాగురుకత ఎంతో అవసరమని తెలిపారు. నూతన క్రిమినల్ న్యాయచట్టాలు పౌరులకు మరింత దగ్గర అవడానికి వారికి సులభతరమైన సేవలను కల్పించడానికి రూపుదిద్దుకున్నాయని చెప్పారు. నూతన క్రిమినల్ న్యాయ చట్టాల గురించి సాధారణ పౌరులు, చట్టాలను అమలు పరిచే యంత్రాంగం, వ్యవస్థలు క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు దాదాపు వందమంది పోలీస్ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం నూతన క్రిమినల్ చట్టాలను ప్రొఫెసర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న అధ్యయనపు ప్రతులు, పుస్తకాలను ఆవిష్కరించారు.

పనులను పూర్తి చేయాలి

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

కేజీబీవీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్, జూన్ 25 : మండలంలోని తెలుగుపల్లి గ్రామంలో నిర్మిస్తున్న కేజీబీవీని ఎమ్మెల్యే వంశీకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఉండేలా నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గృహజ్యోతి కోసం జనం బారులు

ఎంపీడీవో కార్యాలయం వద్ద బారులు దీరిన జనం

తిమ్మాజిపేట, జూన్ 25 : ప్రజాపాలనలో భాగంగా ఉచిత కరెంట్ (గృహజ్యోతి పథకం) కోసం జనం బారులు దీరారు. గతంలో దరఖాస్తులు స్వీకరించినా జీరో కరెంట్ బిల్లులు రాకపోవడంతో అర్హులైన వారంతా తిరిగి తమ వివరాలు ఇవ్వాలని సూచించడంతో తిమ్మాజిపేట ఎంపీడీవో కార్యాలయానికి మంగళవారం జనం తరలివేళ్లారు. కార్యాలయంలో ఒకే కంప్యూటర్‌లో వివరాలు నమోదు చేస్తుండటం, ఒక్క దరఖాస్తుకు 2నుంచి 5నిమిషాల సమయం పట్టడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు చాలా సేపు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతోపాటు గతంలో ఇచ్చిన వారి ఫోన్లకు ఓటీపీ వస్తుండడంతో చాలా మందికి అవగాహన లేకపోవడం, వారి వద్ద ఫోన్లు లేకపోవడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు. కొందరివి గ్యాస్‌కు సంబంధించిన వివరాలు కూడా లేకపోవడంతో వారి వివరాలను అధికారులు నమోదు చేయలేదు.

పట్టాలిచ్చి స్థలాలు మరిచారు

అచ్చంపేట టౌన్, జూన్ 25 : గతంలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలిచ్చి స్థలాలివ్వడం మరచిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్ దేశానాయక్ అన్నారు. మంగళవారం అచ్చంపేటలోని సాయిరాం టాకీస్ వెనుక ఉన్న 213 సర్వే నెంబర్‌లో ఇండ్ల స్థలాలను పట్టాలున్న పేదలకు ఇవ్వాలని పిలుపునిచ్చి అదే స్థలంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంల